క్లుప్తంగా

ఘనంగా బోనాలు..



గట్టుసింగారంలో బోనాలతో వస్తున్న భక్తులు

కూసుమంచి: మండలంలోని పలు గ్రామాల్లో గురువారం బోనాలు (ముత్యాలమ్మ) పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా భక్తులు బోనాలు ఎత్తుకుని ఆలయాల వద్దకు చేరుకుని నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. దీంతో ఆయా గ్రామాల్లో సందడి నెలకొంది.

నేడు విద్యుత్ అంతరాయం

ఖమ్మంవ్యవసాయం: నగరంలోని టౌన్-2 సెక్షన్ రాపర్తినగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని రిజిస్ట్రేషన్ కార్యాలయ ఫీడర్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ బి.రవికుమార్ గురువారం తెలిపారు. దీంతో ఉదయం 10 నుంచి 11 గంటల వరకు, ఎంవీ నగర్ ఫీడర్ పరిధిలో 11 నుంచి 12 గంటల వరకు, రామాలయం ఫీడర్ పరిధిలో 12 నుంచి ఒంటి గంట వరకు వివేకానందనగర్, రాపర్తినగర్, గాయత్రినగర్, రిజిస్ట్రేషన్ ఆఫీస్, గాయత్రిభవన్, బుర్హాన్‌పురం, మామిళ్లగూడెం ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

పరీవాహక ప్రజలకు స్టిక్ కవర్లు

ఖమ్మంమయూరిసెంటర్: వరదల ముంచెత్తితే విలువైన పత్రాలు, స్టడీ సర్టిఫికెట్లను భద్రపరుచుకునేలా మున్నేటి పరీవాహక ప్రాంతాల ప్రజలకు కేఎంసీ అధికారులు గురువారం స్టిక్ కవర్లను పంపిణీ చేశారు. గతేడాది మున్నేరు ముంపునకు గురైన 12 డివిజన్లలోని 2,400 గృహాల్లో వీటిని అందిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య ఆదేశాలతో ప్రత్యేక స్టిక్ కవర్లు పంపిణీ చేస్తుండగా, విలువైన పత్రాలను భద్రపర్చుకుని వరద వస్తే పునరావాస కేంద్రాలకు వెళ్లేలా సిద్ధంగా ఉండాలని సూచిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో పలువురికి తీవ్రగాయాలు

కామేపల్లి: శుభకార్యానికి కారులో వెళ్తున్న పలువురు మార్గమధ్యలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. ఖమ్మంకు చెందిన బానోత్ కవితకుమారి, చిట్టిబాబు, ధరావత్ సుశీల, బానోత్ విజయ, ధరావత్ విజయ కారులో గురువారం ముచ్చర్లలో ఓ శుభకార్యానికి బయలుదేరారు. కామేపల్లి మండలం పండితాపురం బైపాస్ సమీపాన డీసీఎం వ్యాన్ ఎదురుగా ఢీకొట్టడంతో ప్రభుత్వ ఉపాధ్యాయులైన చిట్టిబాబు, కవితకుమారి, సుశీలతో పాటు మరో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటనలో కారు నుజ్జునుజ్జు కాగా.. స్థానికులు వీరిని బయటకు తీసి ఖమ్మం తరలించారు.



పాన్నేకల్‌లోని లోలెవల్ బ్రిడ్జి

కలగానే బ్రిడ్జి..

బుగ్గవాగుపై వంతెన కోసం ఎదురుచూపులు

- వర్షాకాలంలో రాకపోకలకు అంతరాయం
- నీటిమీద రాతలుగానే పాలకుల హామీలు
- కార్యరూపం దాల్చని బ్రిడ్జి నిర్మాణం
- అవస్థలు పడుతున్న ప్రజలు

కామేపల్లి: మండలంలోని పాన్నేకల్ బుగ్గవాగుపై వెళ్లే హైలెవల్ వంతెన నిర్మాణం కలగానే మిగులుతోంది. వాగుపై హైలెవల్ వంతెన నిర్మిస్తామని పాలకుల, ప్రజాప్రతినిధుల హామీలు నీటి మీద రాతలు గానే మిగిలిపోయాయి. బ్రిడ్జి నిర్మాణం చేపట్టకపోవడంతో పాన్నేకల్, బర్లగూడెం, గరిడేపల్లి గ్రామస్తులతో పాటు నిత్యం లింగాల–డోర్నకల్ మధ్య రాకపోకలు నిర్వహించే ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రైతులు సైతం పంట పొలాలకు వెళ్లేందుకు అవస్థలు పడుతున్నారు. వర్షం పడితే రాకపోకలకు నిలిచిపోతున్నాయి. అంతేకాక ఇప్పుడున్న లోలెవల్ బ్రిడ్జి సైతం దెబ్బతింటున్న పరిస్థితి ఉంది. గతేడాది వాగు ఉధృతి కారణంగా అధికారులు రాకపోకలు నిలిపివేశారు. సమస్య పరిష్కారం కోసం గ్రామస్తులు, రైతులు కొన్నేళ్లుగా మొర పెట్టుకున్నా ఫలితం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మాటలకే పరిమితం..

వాగుపై వంతెనా నిర్మిస్తామని గత ప్రభుత్వంలో ఎమ్మెల్యేతో పాటు ప్రస్తుత ఎమ్మెల్యే హామీలు ఇస్తున్నారే తప్ప ఆచరణలో అమలు కావడం లేదు. నిధులు మంజూరు కోసం అధికారులు, ఉన్నతాధికారులు ప్రతిపాదనలు పంపించే వరకే పరిమితం అవుతుంది కానీ బ్రిడ్జి నిర్మాణానికి మాత్రం కార్యరూపం దాల్చడంలేదు. దీంతో సమస్య ఎప్పటికీ పరిష్కారం అవుతుందో అని ఎదురుస్తున్నారు.

అధికారులు దృష్టి సారించాలి



బుగ్గవాగు గుండా ప్రతి రోజు వందలాది మంది రాకపోకలు సాగిస్తారు. వర్షం కురిస్తే రాకపోకలు పూర్తిగా నిలిచిపోతాయి. ప్రయాణికులు, రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలి. అధికారులు కూడా స్పందించి సమస్యను ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లాలి.

– బానోత్ రమేష్, బర్లగూడెం

వర్షం పడితే బంద్..



ఎగువ ప్రాంతంలో వర్షం కురిస్తే పాన్నేకల్ వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో వరద నీటిలో లెవల్ బ్రిడ్జి పై నుంచి ప్రవహిస్తూ రాకపోకలకు పూర్తిగా నిలిచిపోతున్నాయి. ప్రతిసారీ వర్షాకాలంలో ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు, ప్రజాప్రతినిధులు సమస్య పరిష్కారానికి కృషి చేయాలి.

– నున్నావత్ మంగీలాల్, బర్లగూడెం

ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లాం..



పాన్నేకల్ బుగ్గవాగుపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని స్థానిక ఎమ్మెల్యే కనకయ్య దృష్టికి తీసుకెళ్లాం. సంబంధింత అధికారులకు బ్రిడ్జి నిర్మాణానికి కావాల్సిన ప్రతిపాదనలు పంపాలని సూచించారు. త్వరలోనే ఈ విషయంపై జిల్లా మంత్రులను కలిసి సమస్యను వివరిస్తాం.

– గింజల నరసింహారెడ్డి, పాన్నేకల్

జెండా పండగ షురూ..



సిద్ధంగా ఉన్న జాతీయ జెండాలు, బ్యాడ్జీలు, దండలు

స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని మార్కెట్‌లో జాతీయ జెండాలు, బ్యాడ్జీలు, స్టిక్కర్లు, దండలు, తోరణాలు వంటివి సందడి చేస్తున్నాయి. నేడు(శుక్రవారం) జాతీయ జెండాలను ఎగురవేయనుండగా.. ఉపయోగించే అన్ని రకాల వస్తువుల విక్రయాలు, మహాత్మా గాంధీ, చాచా నెహ్రూల చిత్రపటాల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. విద్యార్థులకు ఇష్టమైన బ్యాడ్జీలు, తిరంగా వస్తువుల విక్రయాలు చేస్తున్నారు. – ఖమ్మంగాంధీచౌక్

నగరంలో తిరంగా ర్యాలీ

ఖమ్మం స్పోర్ట్స్/ఖమ్మంమామిళ్ల గూడెం: నగరంలోని కవితమెమోరియాల్ డిగ్రీ కళాశాల ఆధ్వర్యాన, బీజేపీ మూడవ పట్టణ కమిటీ అధ్యక్షురాలు దార్ల మల్లీశ్వరి శంకర్‌గౌడ్ ఆధ్వర్యాన గురువారం తిరంగా ర్యాలీ నిర్వహించారు. కళాశాల ఎన్‌సీసీ కేడెట్లు కళాశాల నుంచి వైరా రోడ్డు, జెడ్పీ సెంటర్ మీదుగా ర్యాలీ కొనసాగగా.. కళాశాల ప్రిన్సిపాల్ కేవీ రమణరావు, ఎన్‌సీసీ అధికారి రాజశేఖర్, అధ్యాపకులు రంగారావు, పాపారావు, ఉపేందర్‌రావులు పాల్గొన్నారు. అలాగే బోసు బొమ్మ సెంటర్ వద్ద బీజేపీ నాయకులు ర్యాలీ తీయగా.. నాయకులు పిట్టల వెంకటనరసయ్య, దోకుపర్తి రవీంద్రకుమార్, పమ్మి అనిత, కొంక్యిమాళ్ల ముత్యమ్ జయరావు, గోనెల శివప్రసాద్, శీలం శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

ఇక నిరంతర నిఘా..



సీసీ కెమెరా ఏర్పాటు చేయిస్తున్న అధికారులు



ఆకేరు పక్కన సీసీ కెమెరా

తిరుమలాయపాలెం: రాకాసితండా అక్విడెక్ట్ వద్ద ఆకేరు వరద ప్రవాహాన్ని నిరంతరం పరిశీలించేందుకు కలెక్టర్ ఆదేశాలతో ఇరిగేషన్ అధికారులు సోలార్ సిస్టంతో సీసీ కెమెరా ఏర్పాటు చేశారు. బుధవారం అక్విడెక్ట్‌ని పరిశీలించిన కలెక్టర్ ఈ ప్రాంతంలో సీసీ కెమెరా ఏర్పాటు చేయడం ద్వారా ప్రవాహం పెరిగితే ఖమ్మం మున్నేరు వద్ద అప్రమత్తం చేసేందుకు అవకాశం కలుగుతుందని చెప్పగా.. గురువారం డీఈ బాణాల రమేష్‌రెడ్డి ఆ ప్రాంతం వద్ద సీసీ కెమెరా ఏర్పాటు చేయించారు. కాగా, అక్విటెక్ట్ వద్ద గురువారం ఆకేరు ప్రవాహం తగ్గుముఖం పట్టిందని, ఎగువ ప్రాంతాల్లో వర్షాలపై ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు.

ప్రత్యామ్నాయ స్థలాలు చూపించాలని వినతి

ఖమ్మంమయూరిసెంటర్: ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ నుంచి సరితాక్లీనిక్ సెంటర్ వరకు ప్రధాన రహదారి వెంట గత 40 ఏళ్లుగా చిన్నచిన్న డబ్బా దుకాణాలు పెట్టుకొని ఉపాధి పొందుతున్న వారికి ప్రత్యామ్నాయం చూపించి, దుకాణాలను తొలగించాలని సీపీఎం ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై.విక్రమ్ అధికారులను కోరారు. ఈమేరకు గురువారం సీపీఎం టూటౌన్ కమిటీ ఆధ్వర్యాన కేఎంసీ మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నగరాభివృద్ధిలో భాగంగా రోడ్లు విస్తరిస్తుండగా.. ఎన్నో ఏళ్లుగా రోడ్ల వెంట చిన్నచిన్న దుకాణాలు పెట్టుకొని జీవనోపాధి పొందుతున్న వారికి ఉపాధి చూపించాల్సిన బాధ్యత అధికారయంత్రాంగంపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు టి.విష్ణు, టూటౌన్ కమిటీ కార్యదర్శి బోడపట్ల సుదర్శన్, నాయకులు హుస్సేన్, సుభాష్, మల్లికార్జున్ రెడ్డి, శివ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌యూబీ పనులు త్వరగా పూర్తి చేయాలి

ఖమ్మంమయూరిసెంటర్: అగ్రహారం రైల్వే గేటు వద్ద రైల్వే అండర్ బ్రిడ్జి(ఆర్‌యూబీ) నిర్మాణ పనులు త్వరగా పూర్తిచేసి ప్రజల రాకపోకలకు అంతరాయం లేకుండా చూడాలని సీపీఐ నగర కార్యదర్శి షేక్ జానిమియా, వన్‌టౌన్ ఏరియా కార్యదర్శి వరద నర్సింహారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం సీపీఐ నగర కమిటీ ఆధ్వర్యాన అసంపూర్తిగా నిర్మించి వదిలేసిన ఆర్‌యూబీ వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తవ్వి వదిలేసిన గత నాలుగేళ్లుగా ఆర్‌యూబీ పనులు జరగకపోవడంతో గుంత ప్రమాదకరంగా మారి గేటు దాటాలంటే ఆందోళన చెందుతున్నారన్నారు. ఇకనైనా అలసత్వం వీడి వెంటనే పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ ఖమ్మం జిల్లా కార్యవర్గ సభ్యులు పగడాల మల్లేష్, ఏనుగు గాంధీ, యానాల సాంబశివారెడ్డి, జిల్లా సమితి సభ్యులు మాల కొండయ్య, మాడుగుల నాగేశ్వరరావు, షేక్.యాకుబ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతమైన నగరంగా ఖమ్మం అభివృద్ధి

రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



రెడ్‌క్రాస్‌లో సెంటర్‌ను ప్రారంభిస్తున్న మంత్రి తుమ్మల

ఖమ్మం అర్బన్: ఖమ్మంను ప్రశాంతమైన నగరంగా తీర్చిదిద్దేలా అభివృద్ధి చేస్తున్నామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. నగరంలోని 36వ డివిజన్ గాంధీచౌక్‌లో రూ.2.25 కోట్లతో నిర్మించే సైడ్ డ్రెయిన్లు, సీసీ రోడ్ల పనులకు గురువారం ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. గాంధీచౌక్ వ్యాపారులు ఎన్నికల సమయాన కోరుకున్నట్లుగా ప్రశాంత వాతావరణం ఇప్పుడు ఉందని చెప్పారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేకున్నా హామీలు, సంక్షేమ పథకాలను అమలుచేస్తున్నామని తెలిపారు. రోడ్ల విస్తరణతో అభివృద్ధిసాధ్యమవుతుందనే విషయాన్ని గుర్తించి అంతా సహకరించాలని మంత్రి సూచించారు. మేయర్ పునుకొల్లు నీరజ మాట్లాడుతూ ఎన్నికల హామీ ప్రకారం నగరంలో అవసరమైన రోడ్లు, డ్రెయిన్ల పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. అనంతరం ఎఫ్‌సీఐ గోడౌన్ వద్ద తిరంగా ర్యాలీని మంత్రి తుమ్మల ప్రారంభించగా, మర్చంట్ అసోసియేషన్ ఆధ్వర్యాన ఆయనను సన్మానించారు. ఖమ్మం మార్కెట్ చైర్మన్ యరగర్ల హన్మంతరావు, పబ్లిక్ హెల్త్ ఎస్‌ఈ రంజిత్, ఆర్డీఓ నరసింహారావు, తహసీల్దార్ సైదులు, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, కార్పొరేటర్లు, నాయకులు పసుమర్తి రాంమోహన్‌రావు, బాలగంగాధర్ తిలక్, వడ్డెబోయిన నర్సింహారావు, సాధు రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● ఖమ్మం మామిళ్లగూడెం: సీనియర్ సిటిజన్ల కోసం ఏర్పాటు చేసిన మల్టీ సర్వీస్ డే కేర్ సెంటర్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సెంటర్‌ను మంత్రి ప్రారంభించి మాట్లాడారు. అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, మేయర్ పునుకొల్లు నీరజ, డీఎంహెచ్‌ఓ కళావతిబాయి, డీడబ్ల్యూఓ రాంగోపాల్‌రెడ్డి, రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ వెలిగేటి చంద్రమోహన్‌తో పాటు డాక్టర్ విజయలక్ష్మి, సాదినేని జనార్దన్‌రావు, జి.సూర్యప్రకాష్‌రావు, రాయల వెంకటేశ్వర్లు, మేళ్లచెరువు వెంకటేశ్వర్లు, గోవర్ధన్‌రావు, కేదాసు నర్సయ్య, ఎం.సుబ్బయ్య, సత్యనారాయణరెడ్డి, ఎం.శ్రీహరి, జిల్లా వెంకటేశ్వర్లు, జి.నాగేశ్వరరావు, అనాసి రాధాకృష్ణ, తాతరాఘవయ్య, జాన్ పుల్లయ్య పాల్గొన్నారు.

కలశ యాత్ర ర్యాలీ

కామేపల్లి: అఖిల భారత యాదవ మహాసభ ఆధ్వర్యాన దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న రేజింగ్ లా రాజ్ కలశ యాత్ర గురువారం పండితాపురం చేరుకుని అక్కడి నుంచి కొత్తలింగాల మీదుగా డోర్నకల్ వెళ్లింది. ఈ సందర్భంగా కలశ యాత్రకు పండితాపురంలో మహాసభ జిల్లా గౌరవ అధ్యక్షుడు మేకల మల్లిబాబుయాదవ్ ఆధ్వర్యాన ఘన స్వాగతం పలుకగా.. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు చిలకల వెంకటనర్సయ్య, కెప్టెన్ జక్కుల శ్రీనివాస్, ప్రోగాం కన్వీనర్ కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి



సింగారెడ్డిపాలెంలో పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ యర్రయ్య

నేలకొండపల్లి: మొక్కలను నాటటమే కాకుండా వాటిని సంరక్షించాలని ఎంపీడీఓ ఎం.యర్రయ్య సూచించారు. గురువారం మండలంలోని సింగారెడ్డిపాలెం, నేలకొండపల్లి పంచాయతీలో అవెన్యూ ప్లాంటేషన్ పనులను పరిశీలించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతీ పంచాయతీలో అవెన్యూ ప్లాంటేషన్ పనులు ప్రారంభించాలని, నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. రహదారికి ఇరువైపులా మొక్కలు నాటాలని, నర్సరీలో ప్రతీ మొక్కకు లెక్క కచ్చితంగా ఉండాలన్నారు. నేలకొండపల్లి మండలంలో 70 వేల మొక్కలు నాటడమే లక్ష్యంగా మొక్కలు నాటుతున్నట్లు చెప్పారు. వాటిలో 15 వేల అవెన్యూ ప్లాంటేషన్ మొక్కలు, 7,100 మొక్కలు రీప్లేస్‌మెంట్ మొక్కలను నాటాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి శివ, ఈజీఎస్ ఏపీఓ ఆర్.సునీత, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, ఈసీ శేషగిరిరావు, తదితరులు పాల్గొన్నారు.

కొత్త బస్టాండ్‌లో మొక్కలు నాటిన ఆర్టీసీ వైద్యురాలు

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం కొత్త బస్టాండ్ ఆవరణలో ఆర్టీసీ వైద్యురాలు సాయి సుష్మ గురువారం మొక్కలు నాటారు. తొలుత సీజనల్ వ్యాధుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆర్టీసీ సిబ్బందికి అవగాహన కల్పించారు. ఆర్టీసీ కండక్టర్ గౌస్ పాషా సీజనల్ వ్యాధులపై చేస్తున్న ప్రచారాన్ని, సేవా కార్యక్రమాలను అభినందించారు.

కేసు నమోదు

రఘునాథపాలెం: మండలంలోని గణేశ్వరంకు చెందిన వృద్ధుడు ఆళకుంట యాకయ్య అదృశ్యంపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ ఉస్మాన్‌షరీఫ్ కథనం ప్రకారం.. ఈ నెల 12న ఇంటి నుంచి బయటకు వెళ్లిన యాకయ్య ఎంతకూ తిరిగి రాకపోవడంతో ఆయన కుటుంబీకులు ఎంత ఆరా తీసినా ఆచూకీ లభించలేదు. దీంతో ఆయన కుమారుడు సీతారాములు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ఆర్థిక సాయం

రఘునాథపాలెం: మండలంలోని వీవీపాలెంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన అర్చకుడు, ట్యూషన్ సార్ శ్రీనివాస్ కుటుంబానికి కేఎల్‌ఆర్ ఫౌండేషన్ తరఫున గురువారం రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు. గ్రామంలో విద్యాభివృద్ధిలో తోడ్పాటు అందించిన సేవలకు గాను సాయం అందించినట్లు ఫౌండేషన్ బాధ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ బాధ్యులు, గ్రామస్తులు బానోత్ తారాబాయి, చంద్రకాని లింగారావు, బానోత్ కీమ, తేజావత్ రామోజీ, మాలోత్ కృష్ణ, బానోత్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

రాకపోకలు బంద్..



తిరుమలాయపాలెం: సోలీపురం వద్ద అడ్డుగా పెట్టిన ట్రాక్టర్



నేలకొండపల్లి: బుద్ధారం–కొంగర గ్రామాల మధ్య రహదారిపై పారుతున్న వరద

ఎడతెరిపి లేకుండా గత రెండు రోజులుగా కురుస్తున్న వానలకు చెరువులు, వాగులు నిండాయి. పంట పొలాలు చెరువును తలపించేలా నీట మునిగాయి. నిండిన వాగులు పొంగి ప్రవహిస్తుండడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ట్రాక్టర్లు అడ్డుపెట్టి రాకపోకలు నిలిపివేశారు.

– సాక్షినెట్‌వర్క్

సర్కిల్.. అంధకారం

కోయచలక క్రాస్‌రోడ్డులో వెలగని వీధిలైట్లు

- ఏడాది కాలంగా ఎదురుచూపులు
- విద్యుత్ బకాయిలు చెల్లించినా ఫలితం శూన్యం
- అవస్థలు పడుతున్న ప్రయాణికులు



కోయచలక క్రాస్‌రోడ్డు సర్కిల్

రఘునాథపాలెం: రఘునాథపాలెం మండలంలోని కోయచలక క్రాస్ రోడ్డులో ఏడాది కాలంగా వీధి దీపాలు వెలుగునివ్వడం లేదు. దీంతో అంధకారంలో ప్రయాణికులు ప్రయాణం సాగించేందుకు నానా అవస్థలు పడుతున్నారు. ఈ ప్రాంతం నుంచి నిత్యం వివిధ పనులకు వస్తూ పోయే వారితో పాటు సమీపంలో ఉన్న గురుకుల పాఠశాలలతో రద్దీగా మారింది. పాఠశాలలు, మండల కార్యాలయాలతో పాటు కోయచలక, రేగులచలక, కోటపాడు, చిమ్మపూడి, పాపటపల్లి, జీకేబంజర, గరిడేపల్లి వంటి పలు గ్రామాల నుంచి ఈ మార్గం గుండా అత్యధికంగా ప్రయాణిస్తున్నారు. మహిళల ఉచిత బస్సు ప్రయాణ పథకం అమల్లోకి వచ్చిన తర్వాత మహిళలతో పాటు నిరుద్యోగులు ఖమ్మం నగరంలో బంగారు, వస్త్ర దుకాణాలు, ఆస్పత్రులు వంటి ప్రైవేట్ రంగాల్లో పనిచేస్తుండగా.. కాలేజీ విద్యార్థులు సాయంత్రం 6 గంటల నుంచి 9 గంటల మధ్య ప్రయాణించి ఇళ్లకు చేరుకుంటున్నారు. ఈ సమయాన సర్కిల్ చీకటిమయంగా ఉండడంతో వారు భయపడాల్సి వస్తోంది. మహిళలు తమ కుటుంబసభ్యులు వచ్చే వరకూ ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది.

ప్రభుత్వ కార్యాలయాలకు చేరువలో..

కోయచలక సర్కిల్ ప్రాంతానికి కూతదూరంలో పోలీస్‌స్టేషన్, తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాలు వంటి ప్రభుత్వ సంస్థలు ఉన్నా.. సమస్యపై అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే అనేకసార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందనలేదని మండిపడుతున్నారు. చీకటితో తరుచూ అనేక రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటూ గాయాలపాలువుతున్నారని వాపోతున్నారు.

బిల్లులు చెల్లించినా..

ఇటీవలే లక్షలాది రూపాయల వీధిలైట్లు బిల్లులు సైతం విద్యుత్ శాఖకు చెల్లించారు. అయినా వీధిలైట్లు మాత్రం మరమ్మతులకు నోచుకోక వెలుగు నివ్వడం లేదు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు మహిళల రక్షణపై దృష్టి సారించి సర్కిల్‌లో చీకటి లేకుండా వెలుగులు అందించాలని కోరుతున్నారు.

➡ పారిశుద్ధ్యంపై నిర్లక్ష్యం వహించొద్దు



సూచనలు చేస్తున్న డీపీఓ ఆశాలత

కూసుమంచి: వానాకాలం సీజన్‌లో గ్రామాల్లో పారిశుద్ధ్య లోపం లేకుండా జాగ్రత్తలు వహించాలని జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత సూచించారు. గురువారం పాలేరు, నర్సింహులగూడెం గ్రామాలను ఆమె సందర్శించి పారిశుద్ధ్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నిల్వనీటిని దోమలకు ఆవాసాలు లేకుండా ఎప్పటికప్పుడు బయటకు పంపించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పారిశుద్ధ్యం మెరుగుకు ప్రజలను భాగస్వామ్యం చేయాలన్నారు. అనంతరం పాలేరు రిజర్వాయర్‌ను పరిశీలించిన ఆమె వరద ప్రవాహాన్ని తెలుసుకుని పర్యాటకుల ఎటువంటి ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు. కూసుమంచి, నర్సింహులగూడెం వద్ద చెరువుల అలుగులను పరిశీలించి తగు సూచనలు చేశారు. ఆమె వెంట డీఎల్‌పీఓ రాంబాబు, ఎంపీడీఓ రాంచందర్‌రావు, గ్రామ కార్యదర్శులు హరీష్, యాకుబ్ పాషా తదితరులు పాల్గొన్నారు.

➡ రిటైర్డ్ కలెక్టర్ సీసీ మృతి

ఖమ్మం రాపర్తినగర్: నిస్వార్థపరుడిగా పేరుగాంచి చాలమంది కలెక్టర్ల వద్ద విధులను సమర్థవంతంగా నిర్వహించిన రిటైర్డ్ కలెక్టర్ సీసీ తండాదై సంపత్‌కుమారాచార్యులు(98) గురువారం అనారోగ్యంతో హైదరాబాద్‌లో మృతి చెందారు. ఈమేరకు డీవైఎస్‌ఓ టి.సునీల్‌రెడ్డి, జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షులు పుట్టా శంకరయ్య, క్రిష్టాఫర్‌బాబు, క్రీడా సంఘాల ప్రతినిధులు, సీనియర్ క్రీడాకారులు ఆయన కుటుంబానికి సానుభూతిని తెలిపారు. మృతుడి కుమారుడు తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు.

➡ సీపీఐ నాయకురాలు..

కామేపల్లి: మండలంలోని తాళ్లగూడెం గ్రామానికి చెందిన సీపీఐ మండల కార్యదర్శి పుచ్చకాయల వెంకటేశ్వర్లు సతీమణి, సీనియర్ నాయకురాలు గురువమ్మ(63) అనారోగ్యంతో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందారు. ఈమేరకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి దండి

సంక్షిప్తంగా..

సురేశ్, సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్, డీసీసీబీ మాజీ చైర్మన్ కూరాకుల హన్మంతరావు, కామేపల్లి సొసైటీ అధ్యక్షుడు పుచ్చకాయల వీరభద్రం, నల్లమోతు లక్ష్మయ్య, చావా నారాయణరావు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

➡ ఎఫ్‌ఆర్‌ఎస్ రద్దు చేయాలి

ఖమ్మంమయూరిసెంటర్: అంగన్‌వాడీ సెంటర్లకు ఎఫ్‌ఆర్‌ఎస్ సిస్టం రద్దు చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి శింగు నరసింహారావు, అంగన్‌వాడీ అసోసియేషన్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి సీహెచ్.సీతామహలక్ష్మి డిమాండ్ చేశారు. అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గురువారం ఖమ్మం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాలకు 5జీ ఫోన్లు ఇవ్వాలని, రూ.18 వేలు వేతనాలు ఇవ్వాలని, అద్దె బకాయిలు చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గాదె లక్ష్మీనారాయణ, తోట రామాంజనేయులు, ఎస్‌కె.హస్నాబి తదితరులు పాల్గొన్నారు.

➡ బీసీలకు బీజేపీ వ్యతిరేకం



మాట్లాడుతున్న నున్నా నాగేశ్వరరావు

ఖమ్మంమయూరిసెంటర్: దొంగ ఓట్లను సృష్టించి మూడవసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ బీసీలకు వ్యతిరేకమని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు అన్నారు. గురువారం నగరంలోని గుమస్తాల భవనంలో సీపీఎం త్రీటౌన్ కమిటీ ఆధ్వర్యాన బీసీలకు తెలంగాణలో 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరుతూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్ బిల్లును ఆమోదింపజేసి రాష్ట్రపతికి పంపిస్తే మోదీ ప్రభుత్వం ఆమోదించకుండా 42 శాతంలో ముస్లింలు ఉన్నారనే సాకుతో అడ్డుకుంటుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై.విక్రమ్, నాయకులు యర్రా శ్రీనివాసరావు, వజినేపల్లి శ్రీనివాసరావు, పత్తిపాక నాగసులోచన, కార్పొరేటర్ యర్రా గోపి తదితరులు పాల్గొన్నారు.

➡ ఉత్సాహంగా టీటీ పోటీలు

ఖమ్మం స్పోర్ట్స్: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని సర్దార్‌పటేల్ స్టేడియంలో ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఎఫ్‌సీఐ) టేబుల్ టెన్నిస్ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. ఈ పోటీల్లో 20 మంది ఉద్యోగులు పాల్గొనగా.. విజేతలకు శుక్రవారం బహుమతులు అందించారు. ఇందులో సింగిల్స్‌లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో వరుసగా అజయ్‌మనోహర్, వెంకట్ శౌరీ, తోటమోహన్ రంగా, వల్లపు కృష్ణలు ఉండగా.. డబుల్స్‌లో అజయ్‌మనోహర్–వల్లపు కృష్ణ, వెంకట్ శౌరీ – యశోదర, తోట మోహన్‌రంగా– రఘుకుమార్‌లు మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. పోటీలను జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షుడు బాలసాని విజయ్, కార్యదర్శి వీవీఎస్ సాంబమూర్తిలు ప్రారంభించగా.. కార్యక్రమంలో పరిటాల చలపతి, ముజ్జార్, ఎఫ్‌సీఐ ఉద్యోగులు పాల్గొన్నారు.

➡ బీఆర్‌ఎస్ హయాంలోనే శాంతి భద్రతలకు విఘాతం

ఖమ్మంమయూరిసెంటర్: బీఆర్‌ఎస్ హయాంలోనే శాంతి భద్రతలకు విఘాతం కల్గిందని, నేడు కాంగ్రెస్ ప్రభుత్వం పాలనలో ప్రజలు క్షేమంగా ఉన్నారని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో శాంతి భద్రతలు క్షీణిస్తున్నాయని ఎమ్మెల్సీ తాత మధు అనడం దెయ్యాలు వేదాలు వల్లించినట్టు ఉందని ఎద్దేవా చేశారు. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో వేల ఎకరాల భూమి, గుట్టలు కబ్జాకు గురయ్యాయని, పోలీస్ వ్యవస్థను పార్టీ కార్యకర్తల్లా వాడుకుని ఇప్పుడు అడ్డగోలుగా మాట్లాడితే సంహించబోమన్నారు. నేటి పాలకులు రాష్ట్ర అభివృద్ధి కోసం సంక్షేమ పథకాలు పేద ప్రజలకు అందించడానికి నిరంతర శ్రామికుల్లా పరితపిస్తున్నారని అన్నారు.

➡ పదవీ కాలం పొడిగింపుపై హర్షం

నేలకొండపల్లి: ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల పాలకవర్గం పదవీ కాలం మరో ఆరు నెలలు పొడిగింపుపై సొసైటీ బాధ్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రంలో గురువారం విలేకరులతో పైనంపల్లి సొసైటీ చైర్మన్ నాగబండి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. రైతులకు మరికొంత కాలం సేవ చేసే అవకాశం కల్పించినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో సొసైటీ చైర్మన్లు కోటి సైదారెడ్డి, తన్నీరు కృష్ణమూర్తి, గూడవల్లి రాంబ్రహ్మం, తన్నీరు సత్యనారాయణ పాల్గొన్నారు.